సాక్షి తిరుపతి

శుక్రవారం । 7 । ఏప్రిల్ । 2023



గరుడ సేవ

తిరుమల : తిరుమల శ్రీవారి ఆలయంలో గురువారం రాత్రి పౌర్ణమి గరుడ సేవ వైభవంగా సాగింది. శ్రీవారు గరుడ వాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు.



కిక్కిరిసిన తుంబుర తీర్థం

తిరుమల: తుంబురు తీర్థం భక్తులతో కిక్కిరిసింది. ఫాల్గుణ పౌర్ణమిని పురస్కరించుకుని భక్తులు తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	37	23
చిత్తూరు	36	22
తిరుమల	32	18
గూడూరు	37	24
నగరి	37	24

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శుక్రవారం(సా)	సహర్ శనివారం(ఉ)
తిరుపతి	6.28	4.44
చిత్తూరు	6.30	4.44
పుంగనూరు	6.32	4.48

న్యూస్‌రీల్

తిరుపతి కమిషనర్‌గా నారపురెడ్డి మౌర్య



నారపురెడ్డి మౌర్య

తిరుపతి తుడా: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా నారపురెడ్డి మౌర్యను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత కమిషనర్ అనుపమ అంజలి బదిలీ కావడంతో ఆ స్థానంలో నారపురెడ్డి మౌర్యను నియమించింది. కాగా అనుపమ అంజలిని తరువాత పోస్టింగ్ కోసం జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్టుమెంట్‌లో రిపోర్ట్ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

30 నాటికి సర్వేరాళ్ల ప్రక్రియ పూర్తి



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ

తిరుపతి అర్బన్: మొదటి దశ సర్వే పూర్తిచేసిన గ్రామాల్లో ఈనెల 30వ తేదీనాటికి పూర్తిచేయాలని జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ సిబ్బందిని ఆదేశించారు. జాయింట్ ఖాతా మ్యుటేషన్‌కు సంబంధించి దరఖాస్తులను గడువులోపు పూర్తిచేయాలన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కన్ఫరెన్స్ హాల్ నుంచి ఆర్డీఓలు, తహసీల్దార్లు, సర్వే అధికారులతో ఆయన వర్చువల్ విధానంలో సమావేశమయ్యారు. సర్వేపై పురోగతిపై తహసీల్దార్లు దృష్టి సారించాలన్నారు. ఒన్ టైమ్ సెటిల్‌మెంట్ పథకానికి సంబంధించి ఇళ్ల రిజిస్ట్రేషన్ చేసే ప్రక్రియ సకాలంలో పూర్తిచేయాలన్నారు. డీఆర్వో శ్రీనివాసరావు, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు కోదండరామిరెడ్డి, భాస్కర్‌నాయుడు, సర్వే ఏడీ జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్

తిరుపతి ఎడ్యుకేషన్: ఐఐటీ–జేఈఈ మెయిన్స్ రెండో విడత పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తిరుపతి జూ పార్కు సమీపంలోని ఐయాన్ డిజిటల్ జోన్‌లో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రంలో ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్స్‌లో పరీక్ష జరిగింది. ఈ పరీక్షకు 990 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా వారిలో 47 మంది గైర్హాజరైనట్టు కో–ఆర్డినేటర్ సింధు తెలిపారు.

గుడ్ ఫ్రైడే సైకత శిల్పం



శిలువ మోస్తున్నట్లు రూపొందించిన సైకత శిల్పం

చిల్లకూరు: క్రీస్తు ప్రభువును శిలువ వేసిన చిత్రాన్ని తీర ప్రాంతంలోని సముద్రం తీరంలో సైకత శిల్పి మంచాల సనత్‌కుమార్ తీర్చిదిద్ది అందరినీ అబ్బురపరిచారు. శుక్రవారం గుడ్ ఫ్రైడే పండుగను పురస్కరించుకుని శిలువ మోస్తున్న క్రీస్తు ప్రభువును మండలంలోని సముద్రతీరంలో గురువారం సైకత శిల్పి తీర్చిదిద్దారు. ఈ చిత్రాన్ని చూసిన వారు ఆయన్ను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తు ఏసు శిలువ మరణం ద్వారా పాపాలను తనపై వేసుకుని మరణించి అటు తరువాత పునరుద్ధానుడైనారని తెలిపారు.

నైపుణ్యమస్తు.. ఉద్యోగప్రాప్తిరస్తు!



చిత్తూరులో 'రోగి సంబంధాల సేవ' కోర్సు చేస్తున్న విద్యార్థులు

'నిరుద్యోగం అనే మాట వినిపించకూడదు. పేదరికంతో ఏ ఒక్కరి చదువూ ఆగిపోకూడదు. చదువే మనం పిల్లలకు ఇచ్చే ఆస్తి. భవిష్యత్‌లో వారు కలెక్టరుగానో.. ఇంజినీరుగానో స్థిరపడితే ఆ ఇల్లు.. ఊరు.. జిల్లా.. రాష్ట్రం బాగుపడుతుంది. దానికోసం ఎంతైనా ఖర్చుచేస్తా..'నంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వేస్తున్నారు. ఆ మేరకు ఇప్పటికే పాఠశాలల రూపురేఖలు మార్చారు. ఇప్పుడు నిరుద్యోగ యువతీయువకులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు సంకల్పించారు. ఇందులో భాగంగానే ప్రతి నియోజకవర్గంలో స్కిల్‌హబ్ సెంటర్లు నిర్వహిస్తూ వారి ఉద్యోగావకాశాలకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. దీనిపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- ప్రతి నియోజకవర్గంలో స్కిల్‌హబ్ సెంటర్
- ఉచిత శిక్షణ, ఉద్యోగ అవకాశాలు
- ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో 6,523 మందికి శిక్షణ
- హర్షం వ్యక్తం చేస్తున్న నిరుద్యోగులు

పుత్తూరు రూరల్: యువతకు ఉద్యోగాలే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పత్రి నియోజకవర్గంలో స్కిల్ హబ్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలో చిత్తూరు, కుప్పం, పలమనేరు, పుంగనూరు, పూతలపట్టు, నగరి, గంగాధరనెల్లూరు నియోజకవర్గాల్లో నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు అందుబాటులోకి తెచ్చింది. పదో తరగతి పాస్/ఫెయిల్ కనీస విద్యార్హత కలిగిన యువతీయువకులకు మూడు నెలలపాటు ఉచిత శిక్షణ ఇప్పిస్తోంది. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందించడంతోపాటు ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తోంది. ఇప్పటికే చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 3,023 మంది శిక్షణ ఇవ్వగా.. అందులో జాబ్ మేళాల ద్వారా 1,650 మంది ఉద్యోగాలు పొందారు. తిరుపతి జిల్లాలో 3,500 మందికి శిక్షణ ఇవ్వగా, 1,850 మందికి ఉద్యోగాలు లభించాయి. ప్రస్తుతం ఈ స్కిల్ హబ్ సెంటర్లు ఆయా నియోజకవర్గాల్లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో నిర్వహిస్తున్నారు. వీటి నిర్వహణకు ఒక్కో సెంటర్‌కు ఒక ఇన్‌చార్జి, కో–ఆర్డినేటర్, కోర్సుల మేరకు ట్రైనీలు విధులు నిర్వహిస్తున్నారు. ఒక్కో కోర్సుకు సంబంధించి ఒక్కో గ్రూపునకు 30 మందిని ఎంపిక చేసి శిక్షణ ఇస్తున్నారు.

చిత్తూరు జిల్లాలో అందుబాటులో ఉన్న కోర్సులు

నియోజకవర్గం	కోర్సులు	కోఆర్డినేటర్	సెల్ నెంబర్
నగరి (పుత్తూరు)	డేటా ఎంట్రీ ఆపరేటర్, సెల్ఫ్ ఎంప్లాయిడ్ టైలర్	రసూల్	63009 54441
గంగాధరనెల్లూరు (కార్వేటినగరం)	మీడియా కంటెంట్ డెవలపర్, డేటా ఎంట్రీ ఆపరేటర్	అబ్దుల్	81425 09017
పూతలపట్టు	అసోసియేట్ ఎలక్ట్రీషియన్, అసిస్టెంట్ ప్లంబర్.	ఫిరోజ్	63019 33565
కుప్పం	బ్యూటీ థెరపిస్టు, డేటా ఎంట్రీ	రాజా	90525 07933
పలమనేరు	ట్రైనీ బ్యూటీషన్, డేటా ఎంట్రీ	సిసింద్రీ	84658 30771
పుంగనూరు	స్యూయింగ్ మెషిన్ ఆపరేటర్, ఫిట్టర్ ఫ్యాబ్రికేషన్, అసిస్టెంట్ సర్వేయర్, అసోసియేట్ ఎలక్ట్రీషియన్.	సుబ్రమణ్యం	77805 99208
చిత్తూరు	అసిస్టెంట్ సర్వేయర్, ఎలక్ట్రీషియన్ డొమెస్టిక్, యూపీఎస్ సర్వీస్, ఫోర్క్ లిఫ్ట్ ఆపరేటర్, అసోసియేట్ డేటా ఎంట్రీ	చైతన్య	81219 84014

తిరుపతి జిల్లాలో అందుబాటులో ఉన్న కోర్సులు

నియోజకవర్గం	కోర్సులు	కాంటాక్ట్ నెంబర్
చంద్రగిరి	4 వీలర్ సర్వీసెస్ టెక్నీషియన్, 2 వీలర్ సర్వీసెస్ టెక్నీషియన్ ఫిట్టర్ ఫ్యాబ్రికేషన్, ఎలక్ట్రీషియన్ డొమెస్టిక్	90593 97752
తిరుపతి	అసిస్టెంట్ ప్లంబర్, సర్వేయర్ ఎయిడ్ అసోసియేటివ్ ఎలక్ట్రీషియన్	97004 13939
గూడూరు	అసోసియేట్ డేటా ఎంట్రీ ఆపరేటర్, అసోసియేటివ్ ఎలక్ట్రీషియన్, ట్రైనీ బ్యూటీషియన్	86398 08782
వెంకటగిరి	ఎలక్ట్రీషియన్ డొమెస్టిక్ సొల్యూషన్, సీఎన్‌సీ ఆపరేటర్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ	98664 20415
సూళ్లూరుపేట	ఫిట్టర్ ఫ్యాబ్రికేషన్, ఫిట్టర్ మెకానికల్ అసెంబ్లీ, మోటార్ ఆర్క్ వెల్డింగ్	86399 15833
సత్యవేడు	సర్వీస్ టెక్నీషియన్, హోమ్ అప్లియన్స్, అసెంబ్లీ ఆపరేటర్–ఆర్ఏసీ, అసోసియేట్ డేటా ఎంట్రీ ఆపరేటర్	91670 13413
శ్రీకాళహస్తి	కలంకారీ ఆర్టిస్ట్, అసోసియేట్ డేటా ఎంట్రీ ఆపరేటర్, ట్రైనీ బ్యూటీషన్ టైలరింగ్	79895 09540

చిత్తూరులో స్కిల్ కాలేజీ

ప్రభుత్వం ప్రతిజిల్లా కేంద్రంలో ఒక స్కిల్ కాలేజీని ఏర్పాటు చేసింది. చిత్తూరు స్కిల్ కాలేజీలో 'రోగి సంబంధాల సేవా విధి నిర్వాహకులు' కోర్సును నిర్వహిస్తున్నారు. ఈ కోర్సును అపోలో హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తుండగా.. ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత అయిన యువతీయువకులు అర్హులు. 6 నెలల ఉచిత శిక్షణా కాలంలో భోజనం, వసతి సౌకర్యాలను ఏర్పాటు చేశారు. కోర్సు పూర్తయిన వారికి ఉద్యోగ అవకాశాలను కల్పిస్తారు.

యువత భవిష్యత్‌కు చక్కటి పునాది



రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన స్కిల్ హబ్ సెంటర్లు నేటి యువత భవిష్యత్‌కు చక్కటి పునాది. చదువుకుంటున్నా, చదువును మధ్యలో ఆపేసిన యువతీయువకులకు ఉద్యోగాలను అందించే కల్పతరువు. తిరుపతిలో స్కిల్ యూనివర్సిటీ, విశాఖపట్నంలో హైఎండ్ స్కిల్ యూనివర్సిటీలు ఏర్పాటు కానున్నాయి.

– ఎం.గుణశేఖర్‌రెడ్డి, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి, చిత్తూరు

ఫ్యాషన్ డిజైనర్‌గా రాణిస్తా



నేను డిగ్రీ పూర్తి చేశా. వలంటీర్ చొరవతో ఫ్యాషన్ డిజైనర్‌గా శిక్షణ పొందుతున్నా. ఫిల్‌స్కట్, అంబ్రెల్ల వంటి పలు రకాల శిక్షణ ఇస్తున్నారు. ఇక్కడ ఇస్తున్న శిక్షణ విధానం మరెక్కడా లేదు. ఫ్యాషన్ డిజైనర్‌గా స్థిరపడాలనుకుంటున్నా.

– శిల్ప, విద్యార్థి, ఫ్యాషన్ డిజైనర్, పుంగనూరు

చదువు మానేసిన వారికి వరం



చదువు మానేసి ఉద్యోగం లేని వారికి స్కిల్ హబ్ సెంటర్లు ఓ వరం. ఉచిత శిక్షణతో పాటు వారి ప్రాంతాల్లోనే ఉపాధిని పొందవచ్చు. డిగ్రీ చదువుతూ కూడా స్కిల్ కోర్సులను అభ్యసించవచ్చు. ప్రస్తుతం పుత్తూరులో 'అకౌంట్స్ ఎక్సిక్యూటివ్స్' కోర్సులో శిక్షణ ఇస్తున్నాం. డేటా ఎంట్రీ ఆపరేటర్, టైలరింగ్ కోర్సులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నాం.

– టీ.నరసింహులు, స్కిల్ హబ్ సెంటర్ ఇన్‌చార్జి, పుత్తూరు

ఉద్యోగం వస్తుందనే నమ్మకం కలిగింది



రెండు నెలలుగా అకౌంట్స్ ఎక్సుక్యూటివ్‌గా శిక్షణ పొందుతున్నా. మంచి అనుభవం ఉన్న వారు ట్రైనింగ్ ఇస్తున్నారు. ఇలా స్కిల్ సెంటర్లలో శిక్షణ పొంది ఉద్యోగం సంపాదించిన వారి సూచన మేరకే నేను ఇందులో జాయిన్ అయ్యాను. ఇక్కడ అన్ని సౌకర్యాలు ఉన్నాయి. మంచి ఉద్యోగం వస్తుందనే నమ్మకంతో ఉన్నాను.

– నవీన్‌బాబు, విద్యార్థి, అకౌంట్స్ ఎక్జిక్యూటివ్, పైడిపల్లి గ్రామం, పుత్తూరు మండలం

సంక్షేమానికి చిరునామా జగన్



రొంపిచెర్లలో ఆసరా మెగా చెక్కును పంపిణీ చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



సభకు హాజరైన లబ్ధిదారులు

- హామీలన్నీ అమలుచేసిన ఏకైక వ్యక్తి
- ఆర్థిక ఇబ్బందుల్లోనూ సంక్షేమ పథకాలు
- ఇలాంటి ముఖ్యమంత్రి ఎన్నడూ చూడలేదు
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల: ఎన్నికల హామీలను 98.44 శాతం అమలు చేసిన ముఖ్యమంత్రిని తాను ఇంతవరకు చూడలేదని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. రొంపిచెర్లలో గురువారం మంత్రి ఆసరా చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ తాను పీజీ పూర్తిచేసిన వెంటనే 1978 వ సంవత్సరంలో రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. అప్పటి నుంచి గమనిస్తున్నానని.. మేనిఫెస్టోను భగవద్గీతలాగా భావించి తు.చ. తప్పకుండా అమలుచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మాత్రమే చూశానని ప్రశంసించారు. కరోనాతో రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న సమయంలో కూడా కోవిడ్ నియంత్రణ చర్యలు పాటిస్తూ.. మరోవైపు కరోనా బారినపడ్డ వారిని కాపాడుకుంటూ వచ్చారని తెలిపారు. అటువంటి సమయంలో కూడా సంక్షేమ పథకాలను అమలుచేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని కొనియాడారు. ఇలాంటి సీఎంను తాను ఎన్నడూ చూడలేదని తెలియజేశారు.

10 శాతం కూడా హామీలు అమలుచేయని చంద్రబాబు

టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు 600 హామీలు ఇచ్చి కనీసం 10 శాతం కూడా అమలు చేయకుండా వెళ్లిపోయారని మంత్రి పెద్దిరెడ్డి విమర్శించారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన ఆయన తాను ప్రాతినిథ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గానికి కూడా ఏమీ చేయలేదని ధ్వజమెత్తారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో చంద్రబాబును జిల్లాకు రాకుండా ప్రజలు తీర్పు ఇచ్చారని అన్నారు. రానున్న ఎన్నికల్లో ఏపీకి రాకుండా చంద్రబాబును తరిమి కొడతారని చెప్పారు.

అభివృద్ధిలో ఆదర్శం

పుంగనూరు నియోజకవర్గాన్ని ఆదర్శంగా తయారుచేశామని మంత్రి పెద్దిరెడ్డి తెలిపారు. రొంపిచెర్ల మండలంలోని ప్రతి గ్రామానికి తారు రోడ్లు, సీసీ రోడ్లు, తాగునీటి ట్యాంక్‌లు, మురికినీటి కాలవ పనులు చేశామని అన్నారు. అనంతరం రొంపిచెర్లలో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హరి నారాయణ్, సీఈవో ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ దేవులపల్లె హరినాథరెడ్డి, ఎంపీడీవో రాజేంద్ర, ఏసీఎం బ్రహ్మానందరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఆడపడుచుల అండ జగనన్న



మాట్లాడుతున్న రమాదేవి

సదుం: ఆడపడుచుల కష్టం తీర్చే అన్న లాగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉన్నారని, తండ్రి లాగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఉన్నారని ఆసరా లబ్ధిదారు రమాదేవి కొనియాడారు. సదుంలో నిర్వహించిన సభలో ఆమె మాట్లాడుతూ.. ''మహిళల కష్టాలు తీర్చేలా వైఎస్సార్ ఆసరా, జగనన్న తోడు, వైఎస్సార్ చేయూత, పింఛన్ వంటి పథకాలు అమలు చేస్తున్న సీఎంకు జన్మజన్మలా రుణపడి ఉంటాం. ఈపథకాల ద్వారా పొందే లబ్ధితో కుటుంబాలు అభివృద్ధి చెందుతున్నాయి'' అని సంతోషం వ్యక్తం చేశారు.

వేసవిలో నిరంతర విద్యుత్

తిరుపతి రూరల్: ఎస్పీడీసీఎల్ పరిధిలో వినియోగదారులకు వేసవిలో నిరంతర విద్యుత్ అందించేందుకు, వ్యవసాయ విద్యుత్ సర్వీసులను మంజూరు చేసేందుకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలని ఆ సంస్థ సీఎండీ సంతోషరావు అధికారులకు సూచించారు. తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో గురువారం సంస్థ పరిధిలోని చీఫ్ ఇంజినీర్లు, జనరల్ మేనేజర్లు, సూపరింటెండింగ్ ఇంజినీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సీఎండీ మాట్లాడుతూ రైతులు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌కు దరఖాస్తు చేసిన వెంటనే సర్వీసులను మంజూరు చేయాలన్నారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా పగటిపూట 9 గంటల విద్యుత్తును సరఫరా చేయాలన్నారు. సంస్థ పరిధిలోని కర్నూలు, కడప, అనంతపురం జిల్లాల పరిధిలో విద్యుత్ పంపిణీ నష్టాలు ఎక్కువగా ఉన్న ఫీడర్లను గుర్తించాలని చెప్పారు. ప్రజలు టోల్ ఫ్రీ నంబరు: 1912కు కాల్ చేసి సమస్యలను తెలియజేయవచ్చన్నారు. ఎస్పీడీసీఎల్ డైరెక్టర్లు వీఎస్ బాబు, సుబ్బరాజు, సీజీఎంలు, జీఎంలు, ఐదు జిల్లాల ఎస్ఈలు, ఎస్ఏఓలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు జగనన్నకే సాధ్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం: దేశ చరిత్రలో ఎవరూ అందించలేనన్ని సంక్షేమ పథకాలను ఏపీ ప్రజలకు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సొంతమని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కొనియాడారు. తిరుపతిలోని ఓ కల్యాణ మండపంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగేళ్ల జగనన్న సుపరిపాలనలో పేదప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా ఇప్పటికే రూ.3.13లక్షల కోట్లు లబ్ధి చేకూర్చారన్నారు. దేశంలో రాజకీయ సంఘ సంస్కర్త ఎవ్వరైనా ఉన్నారా అంటే అది కేవలం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక సామాన్య ప్రజల జీవనశైలి మారిందన్నారు. ఎలాగైనా అధికారంలోకి రావాలన్న దురాలోచనతో చంద్రబాబు పన్నుతున్న కుట్రలు, కుయుక్తులు అన్నీఇన్నీ కావన్నారు. రాష్ట్ర ప్రజలకు జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలతో జగనన్నే మా భవిష్యత్తు అని ప్రజలంతా కోరకుంటున్నారని తెలిపారు.

వారపు సంతల్లో 'చెవిరెడ్డి ఉచిత భోజనం'



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

తిరుపతి రూరల్: అన్నదాత ఆకలి తీర్చాలన్న ఆలోచనతో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సరికొత్త నిర్ణయం తీసుకున్నారు. ఇకపై వారపు సంతల్లో అన్నదాతలతో పాటు కొనుగోలుదారులకు సైతం ఉచితంగా భోజనం అందించాలని నిర్ణయించారు. ఇందుకోసం ప్రత్యేకంగా వారపు సంతల్లో చెవిరెడ్డి భోజన వసతి కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.

రేపు దామలచెరువు సంతలో ప్రారంభం

పాకాల మండలం, దామలచెరువు వారపు సంతలో శనివారం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లను ఆయన పరిశీలించారు.


ఎక్కడెక్కడ భోజనం పెడతారంటే..

చంద్రగిరి నియోజకవర్గ వ్యాప్తంగా వారపు సంతల్లో ఉచిత అల్పాహారం, భోజన సదుపాయాలు కల్పించనున్నారు. ఆదివారం (చంద్రగిరి, బోడేవాండ్లపల్లి), సోమవారం (పాకాల), బుధవారం (యల్లమంద), గురువారం (భాకరాపేట), శుక్రవారం (చిన్నగొట్టిగల్లు, నెరబైలు, నెత్తకుప్పం), శనివారం (దామలచెరువు) ప్రాంతాల్లోని వారపు సంతల్లో అల్పాహారం, భోజనం ఏర్పాటు చేయనున్నారు.

శ్రీకాళహస్తిలో రేపటి నుంచి జగనన్నే మా భవిష్యత్


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

తిరుపతి కల్చరల్: ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ శ్రీకాళహస్తిలో శుక్రవారం నుంచి ఈనెల 21వ తేదీ వరకు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం తెలిపారు. గురువారం రుష ఆస్పత్రి ఆవరణలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు టీడీపీ నేతలు ఎవరూ కృషి చేయలేదన్నారు. శుక్రవారం నుంచి శ్రీకాళహస్తి నియోజకవర్గంలో 14 రోజుల పాటు చేపట్టే జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.


శ్రీవారి రూపంలో భక్తులకు దర్శనమిస్తున్న స్వామివారి సహజ శిలా రూపం


తుంబురు తీర్థం వద్ద క్యూలో వేచి ఉన్న భక్తులు

కిక్కిరిసిన తుంబుర తీర్థం



తిరుమల: తుంబురు తీర్థముక్కోటికి భక్తులు పోటెత్తారు. సుమారు 36,200 మంది భక్తులు ఫాల్గుణ పౌర్ణమి పర్వదినాన తీర్థ స్నానం చేశారు. టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి ఆదేశాల మేరకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేపట్టారు. ఈనెల 5వ తేదీ నుంచి నిరంతరాయంగా పొంగలి, ఉప్మా, పాలు, మజ్జిగ అందించారు. అదేవిధంగా మధ్యాహ్నం, రాత్రి సాంబారు, పెరుగు, టమాట అన్నం, పులిహోరాను పంపిణీ చేశారు. భక్తులు భోజనం చేసేందుకు వీలుగా అవసరమైన షెడ్లు, మార్గమధ్యంలో నిచ్చెనలు, తాగునీటి కొళాయిలు ఏర్పాటు చేశారు. వివిధ రోగాలతో బాధపడే వారిని తీర్థానికి అనుమతించలేదు. పాప వినాశనం వద్ద పార్కింగ్ సమస్య కారణంగా భక్తులను ఆర్టీసీ బస్సులలో మాత్రమే అనుమతించారు.



బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.62,480
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,581
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.76,300
రిటైల్ వెండి గ్రాము	రూ.78.30

అంబేడ్కర్ సంఘం కార్యవర్గం

చిత్తూరు రూరల్: జాతీయ అంబేడ్కర్ సేవా సంఘం జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జాతీయ అధ్యక్షుడు చంద్ర పేర్కొన్నారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరుల సమావేశంలో కార్యవర్గాన్ని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా జగన్‌బాబు, అధికారి ప్రతినిధిగా సుబ్రమణ్యం, ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు, సేవా అధ్యక్షుడిగా మోహన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.


ప్రజలతో మమేకమవుతున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

మీ బిడ్డగా వచ్చా!

- బాధలు తెలుసుకుంటా
- సమస్యలు పరిష్కరిస్తా
- మహాపాదయాత్రలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

భాకరాపేట : 'మీ బిడ్డగా వచ్చా.. బాధలు తెలుసుకుంటా.. సమస్యలు ఆలకిస్తా.. వాటి పరిష్కారానికి మార్గాలు అన్వేషిస్తా.. అధికారులతో చర్చించి శాశ్వతంగా పరిష్కరిస్తా.. ఇప్పటివరకు నాన్న(ఎమ్మెల్యే చెవిరెడ్డి) నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్నీ అభివృద్ధి పథంలో నడిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అండదండలతో మౌలిక వసతులు కల్పించారు. మున్ముందు మరింత అభివృద్ధి చేస్తా'నని చంద్రగిరి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆయన మహాపాదయాత్రలో భాగంగా గురువారం ఎర్రావారిపాళెం మండలంలో గడగడపకూ వెళ్లి కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించారు. తలకోన సిద్దేశ్వస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యల్లమంద పంచాయతీ, నగరి గ్రామం నుంచి మహాపాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికీ జగనన్న సంక్షేమం ద్వారా ఆర్థిక భరోసా లభించిందన్నారు. పంచాయతీ పరిధిలో రూ.6.22 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టినట్టు వివరించారు. పంచాయతీకి జగనన్న సమావేశ మందిరం, యోగా ధ్యాన మందిరం, ఆర్వో వాటర్ ప్లాంట్, గ్రామ వేదికలు, శ్మశాన వాటికల్లో మౌలిక సదుపాయాలు, సీసీరోడ్లు నిర్మించినట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శివలక్ష్మి, జెడ్పీటీసీ కరుణాకరరెడ్డి, వైస్ ఎంపీపీ చెంగల్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, సర్పంచ్ రాణి, ఎంపీడీఓ అమరనాథ్, తహసీల్దార్ దస్తగిరయ్య పాల్గొన్నారు.

మా దీవెనలు నీకేనయ్యా!

'మీ నాయన(ఎమ్మెల్యే చెవిరెడ్డి) కరోనా సమయంలో చాలా ఆదుకున్నాడు. ప్రతి ఇంటికీ మందులు, పండ్లు, కూరగాయలు, కోడిగుడ్లు పంపించాడు. ఆనందయ్య మందు పంపిణీ చేశాడు. పండగొచ్చినప్పుడు కొత్త దుస్తులు అందించాడు. అలాగే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నెలనెలా జీతం ఇచ్చినట్టుగా మా ఇంటికి పింఛను పంపిస్తున్నాడు. ఇంతచేసిన మిమ్మల్ని ఎలా మరిచేది. మా దీవెనలు ఎప్పుడూ మీకేనయ్యా' అంటూ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి పలువురు వృద్ధులు దీవెనలు అందిస్తున్నారు. ఎర్రావారిపాళెం మండలం, యల్లమంద పంచాయతీలో సాగిన మహాపాదయాత్రలో ఈ మేరకు ఓ వృద్ధురాలు దీవెనలు అందించి ఆశీర్వదించారు.


అవ్వ దీవెనలు అందుకుంటున్న మోహిత్‌రెడ్డి

ఘనంగా శ్రీమారుతి హాస్పిటల్స్ ప్రారంభం


హాస్పిటల్స్‌ను ప్రారంభిస్తున్న మోహన్‌బాబు(ఇన్‌సెట్) ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న మారుతీకృష్ణ

తిరుపతి కల్చరల్: ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన శ్రీమారుతి 100 పడకల హాస్పిటల్స్‌ను గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సినీ హీరోలు డాక్టర్ మోహన్‌బాబు, మంచు విష్ణు, మంచు మనోజ్, పలువురు రాజకీయ ప్రముఖులు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. డాక్టర్ మోహన్‌బాబు మాట్లాడుతూ 9 ఏళ్లుగా అతి తక్కువ ఖర్చుతో పేదలకు మెరుగైన వైద్య సేవలందిస్తున్న శ్రీమారుతి హాస్పిటల్స్ మరో అడుగు ముందుకువేసి సరికొత్త టిక్నాలజీతో నూతనంగా శ్రీమారుతి హాస్పిటల్స్‌ను ప్రారంభించినట్టు తెలిపారు. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ తిరుపతి, రాయలసీమ ప్రజలకు గుండెకు సంబంధించిన అత్యాధునిక కేథలాబ్‌ను అందుబాటులోకి తీసుకురావడం సంతోషదాయకమన్నారు. హాస్పిటల్ ఎండీ డాక్టర్ మారుతీకృష్ణ మాట్లాడుతూ మారుతున్న రాయలసీమ ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య సేవలందజేయాలనే ఉద్దేశంతో నూతనంగా శ్రీమారుతి హాస్పిటల్స్‌ను ఆరంభించామని తెలిపారు. కార్యక్రమంలో మేయర్ డాక్టర్ శిరీష, డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరి, బర్డ్ హాస్పిటల్ మాజీ డైరెక్టర్ డాక్టర్ జగదీష్, ఐఎంఏ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ దగ్గుపాటి శ్రీహరిరావు, హాస్పిటల్ డైరెక్టర్ ఎం.రామక్రిష్ణమనాయుడు, కడప జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, మేనేజర్ దామోదరం పాల్గొన్నారు.

ఏడాదిగా ఎన్నో విజయాలు



విద్యార్థులకు అవార్డులు అందజేస్తున్న సత్యనారాయణ

ఏర్పేడు: ఐఐటీ తిరుపతి ఏడాదిగా ఎన్నో విజయాలు సాధించిందని డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ అన్నారు. గురువారం మండలంలోని మేర్లపాక రెవెన్యూలో ఉన్న ఐఐటీ తిరుపతిలో 8వ వార్షికోత్సవం జరిగింది. ఆయన మాట్లాడుతూ 2023 జూన్‌కు మొదటి దశ పూర్తవుతుందన్నారు. గత ఏడాది కాలంలో ప్యాకల్టీ సభ్యులు చాలా పరిశోధన కార్యకలాపాలు, ప్రాయోజిత పరిశోధనా ప్రాజెక్టలను పొందినట్లు వివరించారు. విద్యార్థులు ఏడాదిగా వివిధ విద్య, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని అవార్డులు గెలుచుకున్నట్లు వెల్లడించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం విద్యార్థులకు అకడమిక్ అవార్డులు, వినూత్న ప్రాజెక్టల అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో వారణాసి బెనారస్ హిందూ విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ సుధీర్‌కుమార్ జైన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

హౌసింగ్ కాలనీల్లో మెరుగైన వసతులు


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: జగనన్న హౌసింగ్ కాలనీల్లో మెరుగైన వసతలు కల్పించాలని కలెక్టర్ కే వెంకటరమణారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. ఇంటి నిర్మాణాల బాధ్యత హౌసింగ్ అధికారులదని చెప్పారు. అయితే పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ , విద్యుత్ తదితర విభాగాలకు చెందిన అధికారులు రోడ్లు, తాగునీరు, విద్యుత్ వసతులు ఏర్పాటు చేయాలని చెప్పారు. హౌసింగ్ పీడీ వెంకటేశ్వర్లు, వ్యవసాయశాఖ జిల్లా అధికారి ప్రసాద్‌రావు, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి

వాకాడు: సిద్దిగుంటపాళెం గ్రామం వద్ద గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ఉపాధ్యాయుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ముట్టెంబాక గ్రామానికి చెందిన తిరుమూరు శ్రీనివాసులు(43) చిట్టమూరు మండలం ఆరూరు ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఆయన గురువారం అర్ధరాత్రి తన కుమారుడు చిన్నారి నిఖిల్‌తో కలసి బైక్‌పై వెళుతుండగా దుగ్గరాజపట్నం నుంచి వాకాడు వైపు వస్తున్న ఆటో సిద్దిగుంటపాళెం వద్ద ఢీకొంది. ఈ ప్రమాదంలో ఉపాధ్యాయుడు తీవ్రంగా గాయపడి మృతిచెందాడు. గాయపడిన నిఖిల్‌ను చికిత్స నిమిత్తం కోటకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వాకాడు ఎస్ఐ రఘునాథ్ తెలిపారు.

170 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

తడ: తిరుపతి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం దాడిచేసి 170 బస్తాల రేషన్ బియ్యంతోపాటు కొనుగోలు చేస్తున్న అక్రమార్కుడిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ జీపీ శ్రీనివాసరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. పక్కా సమాచారంతో సీఎస్‌డీటీ ఓబయ్య, విజిలెన్స్‌కి చెందిన అధికారులు విజయ్‌కుమార్, రామకృష్ణనాయక్ సిబ్బందితో కలిసి అక్కంపేటలోని కొనుగోలు కేంద్రంపై దాడిచేశారు. దాడి సమయంలో కొనుగోలు కేంద్రం వద్ద 1.67 లక్షల విలువైన 140 బస్తాల తమిళనాడు బియ్యం, 30 బస్తాలు ఆంధ్రా రేషన్ బియ్యం ఉండడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా కొనుగోలు చేస్తున్న వాటంబేడు గ్రామానికి చెందిన హరనాథ్ అలియాస్ సిద్దయ్య అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడ్డ బియ్యాన్ని కొండూరు సివిల్ గోదాముకు తరలించి నిందితుడిని తడ పోలీసులకు అప్పగించారు. ఈ కొనుగోలు వ్యవహారంలో ప్రతాప్‌నాయుడు, హరనాథ్‌రెడ్డి, కుమార్, శంకర్, సాగర్ తదితరులు ఉన్నట్టు గుర్తించారు.